సీరియల్

విషసర్పాల
సికిందర్

(గత సంచిక తరువాయి)

ఆమె ఎంత వేగంగా నడుస్తోందో, అంత వేగంగానూ కుడిచేతిలో హేండ్ బ్యాగు వూగుతోంది. నిండుగా కప్పుకున్న తెల్లని పైట ఆమె మొహాన్ని బాగా మరుగు పర్చింది. కళ్ళు మాత్రమే జ్యోతుల్లా వెలుగుతూ కనిపిస్తున్నాయి. ఆ కళ్ళలో మృత్యుదేవత కదలాడుతోంది.

ఆమె రోడ్లమీద అక్కడక్కడా కనిపించే బీటు పోలీసుల్ని ప్రక్క సందుల్లోకి తిరుగుతూ తప్పించుకుంటోంది. ఎక్కడా ఏ వ్యాను హెడ్ లైట్లూ తనమీద పడకుండా జాగ్రత్తపడింది. అలా ఆమె అరగంట క్రితం యూనివర్సిటీ రోడ్డునుంచి బయల్దేరి ప్రస్తుతం రాంనగర్ లో నడుస్తోంది....

రాంనగర్ లో తనకు సూచించబడ్డ వీధికి చేరుకుని ఆమె ఇంటి నెంబర్ కోసం చూడసాగింది. ముప్పై అడుగుల్లో సరిగ్గా ఆ ఇంటిని చేరుకుంది. పైట వదిలేసి, హేండ్ బ్యాగును తెరుస్తూ ఆ ఇంటి తలుపు కొట్టింది.

ఆమె కొట్టిందే తడవుగా తలుపు తటాలున తెరచు

కుంది.

అప్పటికింకా సిద్ధంకాని ఆమె అప్రయత్నంగా వెనక్కి దూకింది.

తలుపు పూర్తిగా తెరచుకుంటూండగానే, ఆమె సంభాళించుకుంటూ బ్యాగులోంచి కత్తితీసి పట్టుకుంది. అడుగు ముందుకేసింది.

“ఎవరు కావాలి?” అడుగుతోంది, తలుపు తీసిన యువతి.

“సుధాకర్ వున్నాడా?” అడిగిందామె దగ్గరికెళ్తూ.

ఆ యువతి తృళ్ళిపడి వెనక్కి జరిగింది. “నువ్వు సుహాసినివి కదూ?”

“అవును—నువ్వెవరు?”

“నేను.. నేను..” నీళ్ళు నమిలిందా యువతి. “ముందు లోపలికిరా, మాట్లాడుకుందాం!”

“ఏం మాట్లాడాలి, సుధాకర్‌ని పిలువ్!” రెట్టించిందామె కత్తి చూపుతూ.

ఆ యువతి బెదిరిపోయింది. “అలా చూపకు, ప్లీజ్.”

“నువ్వెవరు? సుధాకర్‌కేమవుతావు?”

“ప్లీజ్, లోపలికిరా, మాట్లాడుకుందాం. నిన్నేమీ చెయ్యం—” ఆ యువతి లోపలికి నడిచింది వేగంగా, “సుధాకర్, ఆమె వచ్చేసింది!”

“వచ్చేసిందా? అక్కడే ఆపు!” మగ గొంతు అంది లోపలినుంచి.

ఆమె కత్తినలాగే పట్టుకుని అడుగు పెట్టింది లోపలికి.

ఆ యువతి బలవంతాన నవ్వింది. ఆ యువకుడు ఆమె వెనుక నిల్చున్నాడు బెదురుతూ. వాళ్ళిద్దర్నీ అనుమానంగా చూడసాగిందామె.

"నేను రమాదేవిని. నేనే వ్రాశా నా ఉత్తరం— ఆవేశంలో. తర్వాత తప్పు తెలుసుకున్నాను. సుధాకర్ నా కన్యాయం చేయనన్నాడు. మేమిద్దరం ఒక్కటయ్యాం. నన్ను మన్నించు. నీకు శ్రమ కల్గించాను."

ఆమెని ఇంకా అనుమానంగా చూసిందామె.

"అవును, రమకు అన్యాయం చేయను. ఒట్టేసి చెబుతున్నా, నీ సమక్షంలో నే ఈమెను స్వీకరిస్తున్నాను. దయచేసి నన్ను క్షమించి వదిలేయ్! అన్నాడతను వేడికోలుగా."

వాళ్ళిద్దర్నీ మార్చి మార్చి చూసిందామె. అప్పుడు అడ్డంగా తలూపింది, "లేదు, ముందు నీ మనసులో విషముంది. దీన్ని కాదనలేవు. అది ప్రవేశించనేకూడదు. నేను నిన్ను చంపాలనుకున్నాను. దీనికి తిరుగులేదు. ఇది నా మనసులోకి రానేకూడదు. నిన్ను చంపాల్సిందే...."

"నన్ను—నన్ను చంపితే నీకేముస్తుంది? ఎందుకు నువ్వింత ఉన్మాదిలా ప్రవర్తిస్తున్నావు?"

"ఉన్మాదం కాదు. మనసిరిగే చేస్తున్నానీ పని. నీలాటి వాళ్ళని కసీసం వందమందిని చంపితేగానీ నా కసి తీరదు!"

"కానీ నిన్ను పెట్టుకున్న ముఠావాళ్ళు నిన్నెరకంగా వంచిస్తున్నారో తెలుసా? వాళ్ళు అందరి వివరాలు నీకివ్వడంలేదు. నాలాటి సామాన్యుల మీదికే పంపుతున్నారు నిన్ను. డబ్బున్నవాళ్ళని బెదిరించి లక్షలు గడిస్తున్నారు—ఈ రోజు పేపర్లో చూశాను!"

"నాకు తెలుసు" అందామె నిర్లక్ష్యంగా. "వాళ్ళు నాకింకేమేం చేశారో కూడా తెలుసు. వాటన్నిటికీ శిక్షించే సమయం సందర్భం త్వరలో వస్తాయి—"

"కానీ ఆలోపు నీకేదైనా జరిగితే — పోలీసులకి దొరికిపోతే—చచ్చిపోతే—"

"అది అంత సులభంకాదు-నన్నెవరూ పట్టుకోలేరు!"

ఆమె గొంతులో దృఢనమ్మకం ధ్వనించింది. క్రోధావేశాలతో ముందుకు కదలబోతున్న ఆమెని చూసి రమాదేవి చటుక్కున చెయ్యి పట్టుకుంది. ఆమె విదిల్చి కొట్టబోయింది. రమాదేవి పట్టు విడవలేదు. ఆమె దీనంగా, అర్థింపుగా చూసిందామె వంక.

"ఆయన్ను చంపకు, ప్లీజ్. నేను నా పొరపాటు తెలుసుకున్నాను. ఆయన తన తప్పు తెలుసుకున్నాడు. ఇద్దరం ఇప్పుడు ఒకటయ్యాం. నువ్వాయన్ని క్షమించి వదిలేయ్. నీకే హానీ చేయం. నువ్వు మమ్మల్ని వదిలేసావనే నమ్మకంతోనే నీకే అపకారంచేసే ఉద్దేశ్యం పెట్టుకోలేదు. లేకపోతే అరిచి గొడవచేసేవాళ్ళం. నీ దారిని నువ్వెళ్ళిపో, ప్లీజ్. నీకింత పట్టుదల కూడదు. నువ్వాయన కేదైనాచేస్తే, అదే కత్తితో నేను పొడుచుకుని చస్తాను."

ఈ మాటలు విని, వాళ్ళిద్దర్నీ తేరిపార చూసిందామె. కత్తిచుట్టు ఆమె చేతివేళ్ళ పట్టు సడిలాయి. రమాదేవి ముఖంలోకి సావధానంగా చూసి, భుజం తట్టింది.

"నీలాంటి వాళ్ళతో త్యాగాలు చేయించడంకాదు నా పని, సుఖంగా వర్థిల్లు."

ఆశ్చర్యకరంగా ఆమె గొంతులో ఆప్యాయత పలికిందిప్పుడు.

* * *

ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి తెచ్చిన కబురుతో హుటా

హుటికి బయలుదేరి వెళ్ళాయి పోలీసుదళాలు, తొమ్మిదిన్నరకు.

కూకట్‌పల్లి కూలిపోయిన మసీదు పరిసరాలు కన్ను పొడుచుకున్నా కనిపించని చీకట్లో మునిగి వున్నాయి. మసీదు చుట్టూతా యాభై గజాల వ్యాసంలో, చెట్లూ పొదల చాటున మాటువేశారు వాళ్ళంతా.

రమణారెడ్డి, కృష్ణన్, కమీషనర్, మరికొందరు అసిస్టెంట్ కమీషనర్లూ, ఇన్‌స్పెక్టర్లూ, కానిస్టేబుల్స్‌తో మొత్తం అరవైమంది బలగం తమ తమ పొజిషన్లు చూసుకుంటూ హడావుడిగా వున్నారు.

అరగంటలో అంతా సర్దుకున్నారు.

అప్పటి నుంచీ ఇప్పుడు పదకొండు గంటల వరకూ వాళ్ళంతో ఓపిగ్గా కాచుకుని వున్నారు. ఎవరి ఆజ్ఞలు వారికున్నాయి. ఆయుధాలూ, వాహనాలూ మసీదు వైపుకే సంధించి వున్నాయి. వాళ్ళందరి కళ్ళూ రెండు కాంతిపుంజాలకోసం రెప్పపడకుండా నిరీక్షిస్తున్నాయి. ఆ రెండు కాంతిపుంజాలతోపాటు వచ్చే మోటారు శబ్దం కోసం చెవులు రిక్కించుకుని వున్నారు.

అదే సమయంలో అడ్డమార్గాలద్వారా రంగుమార్చిన జోంగా జీపులో రంగేళీ రాజాల్లా వస్తున్నారు వాళ్ళు ఆరుగురూ, అవురావురుమంటూ డబ్బు మేసేద్దామని. కానీ ఆ మసీదు దగ్గర తాము మేసేది వేరు అని వాళ్ళకు తెలియందికా....

• • •

హఠాత్తుగా తలుపు తెరచుకోవడంతో ఆమె లోనికి చూసి కత్తి దూసింది.

“ఎవరు—ఎవరు నువ్వు?” అరిచాడతను.

"సుహాసిని!"

"సుహాసిని? ఏ సుహాసిని?" అతను వెనక్కి జరిగి పోతూ అన్నాడు.

"నీలాటి వంచకుల్ని చంపే సుహాసిని—"

"ఏమిటి—ఏమిటి నువ్వనేది?"

"రేవతి ఉత్తరం వ్రాసింది—నీ యజమానికూతురు. నువ్వామెని ఇంట్లో యెవరూ లేనిది చూసి—"

ఆమె మాటలాపేసి చెయ్యి లేపింది. "వివరాలన్నీ అనవసరం. నువ్వేంచేశావో నీకు తెలుసు. శిక్ష అనుభవించు!"

ఆమె చెయ్యి బలంగా తనకేసి వచ్చేస్తూంటే, కళ్ళు మూసుకొని కెవ్వున అరిచాడతను.

లోపల అలికిడి వినిపించింది. "ఏమిటండీ, ఏమైంది?"

ఓ నలభై ఏళ్ళ స్త్రీ పరుగెత్తుకొచ్చింది. అక్కడి దృశ్యం చూసి ఒక్క క్షణం బిత్తరపోయి, పరుగునవచ్చి అతన్ని వెనక్కి లాగేసింది. గుండెలో దిగబోతున్నదల్లా కత్తి గాలిలో విన్యాసం చేసింది.

"ఎవరు? ఎవర్నువ్వు? ఏమిటీ అఘాయిత్యం?" నిలదీసిందామె.

"నీ మొగుడు మోసగాడు. తన యజమాని కూతుర్ని మాయ మాటలతో వంచించాడు—"

"ఎవరన్నారు? నువ్వెవరసలు?"

"నీ మొగుడు దుర్మార్గుడు, అతన్ని చంపుతాను" కత్తితో ఆమె మళ్ళీ ఒక అడుగు ముందుకేసింది.

అతను మరో కేకవేశాడు కెవ్వున, భార్య వెనుక దాక్కుంటూ. కేక వేసి అన్నాడు, "అబద్ధం! నేనెవర్నీ మోసం చేయలేదు! నువ్వు తప్పుగా భావిస్తున్నావు!

రేవతికి నేనేం చేయలేదు! కావాలంటే ఆమెనే అడిగి తెలుసుకో—"

"ఆమే ఉత్తరం వ్రాసింది."

"కాదు! ఆమె వ్రాయలేదు — ఇందులో మోసం జరిగింది! ఇప్పుడే — ఇప్పుడే వెళ్ళి అడుగుదాం. పద! ఆమె అవునంటే, ఆమెకేదేనా చేశానంటే, అప్పుడు కచ్చితంగా చంపు!"

"తప్పించుకునే దారులు వెతకకు!"

"ఆయన అలాటివారు కారు! నువ్వు పొరబడ్డావు! ఆయన్నేదైనా చేశావంటే, నిన్ను కొట్టి చంపేస్తాను! నీకంటే యెక్కువ బలం వుంది నాకు!" అరిచిందతని భార్య.

"ఆ ఉత్తరం రేవతి వ్రాసింది కాదు! ఆమె అలాటి పని చేయదు! ఎందుకు, నేనెప్పుడూ ఆమెతో మాట్లాడనే లేదసలు! ఆమెకు నేనేం చేస్తాను?"

"మరి ఎవరు వ్రాశారు ఉత్తరం?"

"ఏమో, నాకెలా తెలుస్తుంది...." మాటలాపేశాడతను. ఉలిక్కిపడ్డాడు, "ఇప్పుడు తెలిసింది!" అంటూ భార్యని చూశాడు, "ఆచారి—ఆచారి వ్రాసివుంటాడా ఉత్తరం! అవును, వాడే!"

భార్యకూడా ఉలిక్కిపడింది, "వాడు వ్రాశాడా?"

"ఎందుకు వ్రాస్తాడు?" అడిగిందామె, కత్తిని అలాగే పట్టుకుని.

"పగతో! వ్యాపారంలో వాణ్ని నష్టపర్చానని వాడి వాదన! ఆ పగతోనే నన్నిలా చంపించాలనుకున్నాడు."

"నన్ను ఏమార్చకు. నువ్వు కుటుంబరావు దగ్గర పనిచేస్తున్నావు. నీకు వ్యాపారమేమిటి? ఆచారిని నువ్వు

నష్టపర్చడమేమిటి? నన్ను నమ్మించకు!"

"ఓహ్, ఈ కుటుంబరావు దగ్గర చేరకముందు వ్యాపారం చేశాను! చేతులు కాల్చుకున్నాను! అప్పుడు నా పార్ట్‌నర్ ఆ ఆచారి వాడ్ని నష్టపర్చాసని నామీద పగబట్టాడు!"

"నమ్మించకు!"

"వాడిదగ్గరి కెళ్దాం, పద! వాడొప్పుకోడు. ముందు రేవతి దగ్గరికెళ్ళి ఆమె వ్రాసిందో లేదో తెలుసుకుందాం!"

అతను భార్య వెనుకనుంచి ధైర్యంగా ఆమెముందు కొచ్చాడు. భార్య గబుక్కున వచ్చి అతని చెయ్యి పట్టుకుంది. "పదండి, నేనూ వస్తాను!"

వాళ్ళని సందిగ్ధంగా చూస్తూ ఆమె కత్తిని దించేసింది. దానివైపోసారి నిరసనగా చూసి నిట్టూర్చింది. అప్పుడక్కడ్నించి కదలి వాళ్ళవైపు చూడకుండా బయటికి నడిచింది.

ఆగలేదామె. మళ్ళీ తిరిగి చూడలేదు. చీకట్లో కలిసిపోయింది.

వాళ్ళిద్దరు ఏమీ అర్థంకాక ఒకర్నొకరు పట్టుకుని నిలబడిపోయారు.

* * *

రంగు మార్చిన జోంగా జీపులో రంగేలీరాజాల్లా వస్తున్నవాళ్ళు ఆరుగురు ఇంకా డబ్బు మేసే ఆశలోనే వున్నారు.

బాంబే హైవేమీదికి వచ్చాక అన్నాడు శంభూనాథ్, "మనలో మాట, మన శాడిస్టుకో షాక్ ట్రీట్‌మెంట్ ఇస్తే ఎలా వుంటుంది?"

"ఎలా అది?" జింబో ఆసక్తిగా అడిగాడు.

"ఇప్పుడు మనం ఎత్తుకునే డబ్బు కోటి పదిలక్షలు. దాంతో అదే పోతగా బాంబే వెళ్ళిపోతే?"

"ఓహ్, స్వామి ద్రోహం."

"లేకపోతే మన ప్రాణాలకే మోసముంది, జింబో. చూశావా పరిస్థితులు ఎలా మారుతున్నాయో? ఈ తీరున రేపో మాపో మన పని కొలిక్కి వచ్చేలా వుంది. కట కటాలో, లేకపోతే కైలాసానికి ఎక్స్‌ప్రెస్ టిక్కెట్టో అవుతుంది మన గతి."

"కానీ మరాఠీవాడు మొత్తుకుని చస్తాడు!" అన్నాడు జింబో.

"చావనీ, మనకేం? నన్నెంత అవమానిస్తున్నాడు! ఆఫ్టరాల్ ఒక మేనియాక్ నాలాంటి కార్యశూరుడ్ని అవమానించడమా? చెల్లదు. ఏమంటారు మీరంతా?" అడిగాడు శంభూనాథ్ మిగతా వాళ్ళని.

"మేమంతా నీతోటే, బాస్!" అన్నారు వాళ్ళంతా.

• • •

అక్కడ లాల్ గంట సేపటినుంచీ కాచుకునివున్నాడు- ఆపర్ణా అపార్టుమెంట్స్ దగ్గర, సతీష్ అతడి స్నేహితుడి రాకకోసం.

కానీ వాళ్ళ జాడలేదు.

సమయం పదకొండు దగ్గర దాటింది.

పదింపావు వరకూ ఆఫీసుకు తనకు ఫోన్ రాలేదు, పక్క ఫ్లాట్‌లో వాళ్ళనుంచి. అప్పుడు తనే బయల్దేరి వచ్చాడు, ఇహ వుండలేక. ఫ్లాట్‌కి అప్పటిలాగానే తాళం వేసి వుంది. కిందికివచ్చి, కారెక్కి అపార్టుమెంట్స్ కెదురుగా వున్న చిన్న సందులోకి తీసికెళ్ళి ఆపి కూర్చు

న్నాడు—సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ.

ఆఫీసులో వున్నప్పుడు కృష్ణన్ ఫోన్ చేసి, ఇన్స్పెక్టర్ రమణారెడ్డి ఇచ్చిన టిప్ అందించాడు. కానీ లాల్ తనకు సతీష్‌తోనే ఇంట్రెస్టు వుందన్నాడు. అతని విషయం తేల్చుకోనిదే మరేదీ చూడనని చెప్పి, కూకట్‌పల్లి ఆపరేషన్‌ని అతన్నే హేండిల్ చేయమన్నాడు. అప్పుడు బయల్దేరి ఇక్కడికి వచ్చేశాడు.

ఈ గంటసేపూ అతను వివిధ రకాలుగా ఆలోచించాడు. సతీష్ అయిపు గురించిన ఏ వూహా సరయినదని నమ్మకం కల్గడంలేదు.

అప్పుడతని కొకటి తట్టింది. కారుదిగి రోడ్డుమీది కొచ్చాడు. బషీర్ బాగ్ మెయిన్ రోడ్డుమీద షాపులూ బార్లూ అన్నీ మూసీ వున్నాయి. కానీ ఒకటి రెండు హోటల్స్ తీసే వున్నాయి. దగ్గర్లో వున్న ఇరానీ హోటల్‌లోకి నడిచి లాల్ ఫోన్ అడిగి డయల్ చేశాడు కంట్రోల్ రూముకి. "దయచేసి ఈ కారు ఎక్కడుందో ట్రేస్ చేయగలరేమో చూడండి—" అని నెంబర్ చెప్పాడు.

ఆ కారు నెంబర్ సతీష్ వాళ్ళది.

* * *

ఆమె అటూ ఇటూ చూసింది. ఎవరూ లేరు. చిక్కడపల్లిలోని ఆ వీధి నిర్మానుష్యంగా చీకటిగా వుంది.

జాగ్రత్తగా ఆమె ఆ ఇంటి తలుపు చేరుకుని దబదబ కొట్టింది.

ఆ శబ్దం పిడుగులు పడుతున్నట్టే వుందా సమయంలో.

అప్పుడామె బ్యాగు తెరచి కత్తి తీసింది. ఇంకెన్ని వున్నాయో లెక్కపెట్టింది. ఆరు. ఆమె ముఖంలో

అలసట తాలూకు చిహ్నాలు స్పష్టంగా వున్నాయి. కాని నిరాశ రవంతైనా లేదు.

ఆమె అసహనంగా, సమాధానం రాకపోవడంతో, మళ్ళీ కొట్టింది తలుపుని.

ఎవరూ పలకలేదు.

మళ్ళీ కొట్టింది.

ఇంకోసారి కొట్టబోయింది—

అప్పుడు—

"ప్లీజ్ .... హేండ్సప్, మిస్ సుహాసినీ" విన్పించాయి మాటలు, వెనుకనుంచి.

ఆమె శరీరం కట్టెలా బిగుసుకుపోయింది. వెనక్కి తిరిగే స్పృహే లేకపోయింది.

"మిస్ సుహాసినీ, ఆ కత్తి పడేసి చేతులెత్తు...." విన్పించింది మళ్ళీ అదే గొంతు, "డిసీజ్ ఇన్‌స్పెక్టర్ రివేరా! నీ మెడకు అనుతున్నది నా చేతిలో రివాల్వర్! జాగ్రత్త. చెప్పినట్టు చెయ్. నిన్ను చంపడం నాకే మాత్రం ఇష్టంలేదు.... వెరీగుడ్, కత్తి వదిలేశావు....ఇక ఇలాగే....ఇలాగే.... వెరీ వెల్, ఇలాగే వెనక్కి తిరిగి నడువ్. హాహా! నువ్వొస్తావని నేను పెద్దగా ఆశించలేదు, సుహాసినీ. నా వంతు ఇవ్వాళ రాదనుకున్నాను....కానీ-గుడ్‌లక్. ఇవ్వాళే వచ్చేసి ఇలా నాకు చిక్కిపోయి..."

అప్పుడా వెనుకనుంచి అతని తలమీద యేదో వచ్చి పడింది—

'ఠంగ్'మని మోగిందతని మెదడు. జిగేలుమని మెరిసిందొక మెరుపు. 'హుఁవ్!'మని కూలిపోయాడతను, తల పట్టుకుని.

ఆమె కొయ్యబారిపోయి చూసిందిదంతా.

అతను నవ్వుతూ చూస్తున్నాడు, చేతిలో కర్ర ముక్కతో.

"ఆ ఎదురిల్లే మాది. ఈ ఇంట్లో ఏవో మార్పులు జరుగుతూంటే ఆసక్తి కలిగి ఆరాలుతీసిన మీదట ఇతను ఇన్ స్పెక్టర్ రివేరా అని తెలిసింది. ఆపైన ఇతని ఎత్తు యేమిటో తెలుసుకోవడం కష్టంగాలేదు సిస్టర్, సిటీలో పరిస్థితుల్ని గమనిస్తూంటే. అది పారకుండా చేయాలనుకున్నాను. చేసేశాను."

"ఎందుకు? ఎందుకు చేశావు?"

"నువ్వు పట్టుబడడం నేనంగీకరించను."

"ఎందుకు — ఎందుకు అంగీకరించవు?"

"నా సిస్టర్ కూడా నీలాంటి అన్యాయానికే బలైంది. షీ ఈజ్ డెడ్ నౌ."

ఆమె ఆశ్చర్యంగా చూసిందతనివంక. "థాం..క్స్."

"నో మెన్షన్. నువ్విక్కడ్నించి తొందరగా వెళ్ళిపో."

ఆమె కృతజ్ఞతగా చూసి, గబగబ కిందపడ్డ కత్తిని అందుకుంది. ఇన్ స్పెక్టర్ పక్కనే వున్న అతని రివాల్వర్ని కూడా తీసుకుంది. అప్పుడతనివైపు చూడకుండా వడివడిగా నడిచి వెళ్ళిపోసాగింది.

ఆమె కనుమరుగయ్యేవరకు చూసి ఆ యువకుడు నిట్టూర్చాడు. అప్పుడు ఇన్ స్పెక్టర్ దగ్గరికి కదిలి అతని జేబులో ఒక చీటీ వుంచాడు. దానిమీద ఇలా వుంది.

"I am sorry."

• • •

నెమ్మదిగా ఎగుడు దిగుడుగా వున్న బాటగుండా జాగ్రత్తగా, పైకీ కిందికీ వూగుతూ సమీపిస్తున్న రెండు

కాంతిపుంజాలు కంటపడటంతో, ఒక్కసారి అక్కడ చలనం ప్రారంభమైంది....

"దే హేవ్ కమ్!" అన్నాడు కమీషనర్, చటుక్కున బాయ్ నెట్ మీదనుంచి లేస్తూ.

అతని పక్కన ఇద్దరు ఇన్ స్పెక్టర్లు, ఆరుగురు కానిస్టేబుల్స్, వెంటనే మోకాళ్ళమీద కూర్చుంటూ ఆయుధాలు ఎక్కుపెట్టారు.

మరి కొంచెం దూరంలో, వాళ్ళకిరువైపులా మరో రెండు అసిస్టెంట్ కమీషనర్లతో కూడిన జట్లు అదే ప్రకారం చేశాయి.

వాళ్ళ కభిముఖంగా మరో మూడు జట్లు కూడా అలాగే సిద్ధమయ్యాయి.

మొత్తం అయిదు జట్లవద్దవున్న ఏడు వాహనాలలోని డ్రైవర్లు కమీషనర్ ఆజ్ఞకోసం యెదురుచూస్తున్నారు.

వాళ్ళందర్నీ చెట్లూ పొదలూ కవర్ చేస్తున్నాయి. అలా సమీపిస్తున్న ఆ రెండు హెడ్ లైట్లు ఆ చీకటి ప్రదేశాన్ని కాంతివంతం చేస్తున్నాయి. అవి క్రమంగా దగ్గరవుతూ మసీదువైపుకు తిరిగాయి. దాన్ని కాంతిమయం చేశాయి. చేస్తూ ప్రాంగణంలోకి ప్రవేశించిందా వాహనం. మెట్లకు పదడుగుల దూరంలో ఆగిపోయింది.

లైట్లు ఆరిపోయాయి.

"లైట్సాన్!" కమీషనర్ గొంతు మార్మోగింది. దాంతోపాటే చకచక లైట్లు వెలిగిపోయి, మూడు పక్కలనించీ, ఆ వెహికల్ని తళుక్కున మెరిపించాయి.

కమీషనర్ గొంతు స్పీకర్లోంచి వెలువడసాగింది. "కమీషనరాఫ్ పోలిస్ స్పీకింగ్. దిసీజ్ సరెండర్ వార్నింగ్. మీరంతా ఖాళీ చేతుల్తో కిందికి దిగి నిల

బడాలి. మిమ్మల్ని మేం చుట్టుముట్టాం. మీ రే పిచ్చి ప్రయత్నాలు చేయకుండా చేతులెత్తి దిగాలి. వరుసగా ఒక్కొక్కరు ... చెప్పినట్టే చేయాలి. ఎవరైనా అతిగా ప్రవర్తిస్తే వెంటనే ఫైరింగ్ ఓపెన్ చేయబడుతుంది.... కమాన్, వన్ బై వన్, మోర్ స్లోలీ ప్లీజ్!...."

చెప్పడం పూర్తిచేసి కమీషనర్ పొద చాటునుంచి తొంగి చూశాడు రివాల్వర్ గురిపెడుతూ. ఆ ప్రాంతం దేదీప్యమానంగా వుంది. ఆ వాహనం అలాగే ఆగివుంది. అందులో కదలికలేదు. శబ్దాలు లేవు. మాటలు లేవు.

"కమాన్! ఆలస్యం చేయకండి! ఒక్కొక్కరే దిగి నిలబడండి!" మళ్ళీ అరిచాడతను.

అయినా కదలిక లేదు.

మిగతా జట్లలో వాళ్ళుకూడా ఆదుర్దాగా చూస్తున్నారు. కృష్ణన్ పూర్తిగా నేలమీద బోర్లా పడుకుని వున్నాడు.

కదలికలేదు..

"ప్లీజ్ ఫైనల్ వార్నింగ్! వెంటనే దిగకపోతే ఫైరింగ్ ఓపెన్ చేయబడుతుంది!"

అదే మొండితనం.

అదే సమయంలో హైవే దిగి మలుపు తిరుగుతున్న జోంగా జీపులో రంగేలీరాజాలు, ఈ హెచ్చరిక వినేశారు.

వాళ్ళు కలవరపడ్డారు.

"హేం, స్టాప్ హియర్!" అరిచాడు శంభూనాథ్, "ఏమిటది? అక్కడ లైట్లేమిటి? ఓ గాడ్, వాళ్ళొచ్చేశారు! పోలీసులొచ్చేశారు! కొంప మునిగింది! గాడ్, కొంప మునిగింది..తిప్పు వెనక్కు బండిని, నారాయణ్!"

నారాయణ్ గాభరాగా స్టీరింగ్ని కుడివైపుకు తిప్పాడు. జీపు గిర్రున తిరిగిపోతుంటే జింబో గొంతు చించుకుని అర్చాడు, "ఓహ్, వాళ్ళెలా వచ్చారిక్కడికి? ఎవర్ని అక్కడ హెచ్చరిస్తున్నది?"

"మనకోసం ఎవరో పార్టీ వచ్చి వుంటుంది—వాళ్ళు మనమనుకుని పొరబడ్డారు! పోనీయ్!"

నారాయణ్ స్టీరింగ్ని తిప్పేస్తూ వెనుకే శరవేగంతో వచ్చేస్తున్న మూడు హెవీ లోడ్ లారీల్ని చూసుకో లేదు—

జీపు అమాంతంగా ఎగిరి అల్లంత దూరాన పడింది.

అదే క్షణంలో కమీషనర్ చేతిలో రివాల్వర్ పేలింది. బుల్లెట్ పైన గాలిలోకి దూసుకుపోగానే ఆ కారులోంచి ఒక వ్యక్తి "చంపాద్దు! నన్ను చంపొద్దు!" అని అరుచుకుంటూ పరుగెత్తుకొచ్చాడు.

అంతా దిగ్భ్రమ చెంది అటువైపు వురుకుతూండగానే, రోడ్డుమీద పెద్ద అలజడి రేగింది....

క్షణంలో ఇక్కడ పరిస్థితి గ్రహించిన రమణారెడ్డి కృష్ణన్లు లేచి దౌడుతీశారు కసురుకుంటూ, రోడ్డు మీదికి.

జీపు అంత పైకెగిరి మూడుచుట్లు తిరిగి తలకిందుల పడగానే అందులోని వాళ్ళు ఎలుకపిల్లలాగా బయటికి వచ్చేయసాగారు. కానీ శంభూనాథ్ మాత్రం కాదు. అతను అతని కాళ్ళ దగ్గరే వున్న అల్యూమినియం ట్రంకు వచ్చి తలకు తగలడంతో తెలివి తప్పిపోయాడు. అతన్ని బయటికి లాగసాగాడు జింబో. మిగిలిన నల్గురూ అప్పుడే బయటపడి పరుగెత్తసాగారు, కుడివైపు రోడ్డు దిగి.

జోడు గుర్రాల్లాగా పరుగెత్తుకొచ్చిన రమణారెడ్డి,

కృష్ణన్‌లని అక్కడి దృశ్యం ఉద్రేకపర్చింది. ఆ మూడు లారీలూ ఒకదాని వెనక ఒకటి ఆగిపోయాయి. పదిగజాల దూరంలో జీపు.

వాళ్ళంతా తేరుకునేలోగానే అవతలినుంచి శంభూనాథ్‌ని లాగి భుజాన ఎత్తుకుని నిలబడుతున్న జింబో, లారీ హెడ్ లైట్ల కాంతిలో తను ఎక్స్‌పోజ్ కాగానే, రివాల్వర్ తీసి పేల్చి పరుగుతీశాడు రోడ్డు దిగి కుడి వైపుకి.

అప్పుడు గానీ జోడు గుర్రాల మెదళ్ళు పనిచేయ లేదు. ఆ బుల్లెట్ వాళ్ళకు తగ్గిలేదు. ఓ హెడ్ లైట్‌ని బద్దలు చేసింది. విజిల్స్ తీసి వూదుతూ, లారీ వాళ్ళనించి చెరో టార్చి తీసుకుని అటు వురికారు.

ఆ చీకటి మైదానంలోపడి అడవి దున్నల్లా పరుగెడుతున్న వాళ్ళందరూ తనమీద టార్చిలైట్లు పడగానే క్షణం ఆలస్యం చేయకుండా రివాల్వర్స్ తీసి ప్రేల్చే శారు.

గభాల్న కింద కూర్చుండిపోయి బదులిచ్చారు కృష్ణన్, రమణారెడ్డిలు. దున్నలు నేలకూలలేదు. సంతోష్, సుభాష్, అశోక్, నారాయణ్‌లు ముందున్నారు. వెనుక జింబో శంభూనాథ్‌తో పరుగెడుతున్నాడు..... వాళ్ళంతా మరో రౌండు కాల్చారు. వాటినుంచి తప్పించుకుని మళ్ళీ లేచి వురికారు కృష్ణన్, రమణారెడ్డిలు. ఈసారి మెరుపులా మూడు క్షణాల్లో ముప్పై అడుగుల దూరాన ముగ్గుర్నీ నేల కూల్చేశారు.

సుభాష్, అశోక్, నారాయణ్‌లు.

సంతోష్ పిచ్చివాడిలా మరింత వేగం పెంచి వురుకు తూండగా అప్పుడు — ముందు టార్చి వెలుగూ, దాని

వెనక రెండు గుళ్ళూ అతన్నాక్రమించుకున్నాయి.

జింబో అలసిపోలేదు. శంభూనాథ్ బరువుని మోస్తూ, కాల్పులకి బదులిస్తూ కాయశక్తులా పరుగుతీస్తున్నాడు. అతని మీదనుంచి ఎక్కడా టార్చిలైట్ల వెలుగు తప్పిపోవడం లేదు. అప్పుడు-రమణారెడ్డి గురి సరిగ్గా కుదిరింది. ఒక బుల్లెట్ తలలోకీ, జింబో ఆగిపోగానే మరొకటి శంభూనాథ్ వీపులోకీ దిగబడ్డాయి.

రెండు బుల్లెట్లని మూర్చుకున్న శంభూనాథ్ శరీరాన్ని జారవిడిచేశాడు జింబో. "ఫేర్ వెల్, మై ఫ్రెండ్ ...." అని అతను రివాల్వర్ని రెండు చేతుల్తో పట్టుకున్నాడు. ఇరవై అడుగుల దూరంలోనే ఆగిపోయిన ఇన్ స్పెక్టర్ కి అప్పుడు జింబో ఆకారం వెర్రెత్తించింది.

వికృతంగా, క్రూరావేశంతో రెచ్చిపోయిన ఆంబోతులా వచ్చేస్తున్నాడతను మీదికి....రివాల్వర్ ప్రేల్చుకుంటూ.

మొదటి రెండు షాట్లకే తేరుకున్న కృష్ణన్, మిగిలిన గుళ్ళన్నీ అతనిమీదికి కురిపించేశాడు.

రమణారెడ్డికూడా రివాల్వర్ ఖాళీచేశాడు.

వరసగా కడుపులో ఒకటీ, కంఠంలో ఒకటీ, ఆ తర్వాత ఛాతీలో ఒకటీ, నడుములో ఒకటీ బుల్లెట్లతో మోయలేని బరువై పోయింది జింబోకి. అతనూ బ్రతుకు చాలించాడు.

* * *

లాల్ సిగరెట్ పారేశాడు. అసంతృప్తిగా నొసలు చిట్లించాడు. రెండుసార్లు ఆవులించాడు. విసుగ్గా టైము చూసుకున్నాడు. పన్నెండూ నలభై.

ముంచుకొస్తున్న నిద్రని ఆపుకుంటూ అతను అపార్ట

మెంట్ బిల్డింగ్ కేసి చూశాడు. అదలాగే వుంది, నిశ్శబ్దంగా. చాలా తక్కువ భాగాలలో దీపాలున్నాయి. ముందంతా నిర్మానుష్యం. ఒక్క మనిషి లేడు ఫోన్ చేయడానికి. కానీ అంత త్వరగా ఫలితముంటుందనిపించ లేదు. తిరిగి అలాగే కూర్చుని సిగరెట్ తీసి వెలిగించాడు. అప్పుడు జాన్ జ్ఞాపకమొచ్చాడు.

అతను ఆందోళన పడ్డాడు. జాన్ గురించి ఆలోచన ఇదివరకెప్పుడూ ఆందోళన పర్చలేదు ఇంతగా. ఏ కేసూ అతని తోడులేకుండా పరిశోధించలేదు. ఇప్పుడీ వ్యవహార మంతా అతను తోడు లేకుండానే సాగిపోతోంది. నిట్టూర్చాడతను. ఆ డర్టీ పార్ట్‌నర్ కి తను జ్ఞాపకం వస్తున్నాడా? తననెప్పుడైనా జ్ఞాపకం చేసుకుంటాడా, ఆ బ్రూట్?

అప్పుడు-తను బందీగా వున్నప్పుడు జాన్ చేసిన ప్రయత్నాలు జ్ఞాపకం వచ్చాయి అతనికి. నిట్టూర్చాడు తేలికగా.... వెల్, సర్టెన్‌లీ దట్ బ్రూట్ కేర్స్ ఫర్ మీ. మరి తనేం చేస్తున్నాడు అతనికోసం?

ఈ ప్రశ్న అతనికి సూటిగా తగిలింది.

గిల్టీగా ఫీలవుతూ రోడ్డుమీదికి చూశాడు.

అంతే, అప్పుడతని చూపులక్కడ నిల్చిపోయాయి.

అక్కడ—

ఆ లైటు స్తంభం కిందనుంచి వస్తూన్న ఆకారంమీద.

అతను గాభరాగా ముందుకు వంగాడు.

చరచరా నడిచి వచ్చేస్తూన్న ఆ స్త్రీ ఆకారం, గబగబా అపార్ట్‌మెంట్ బిల్డింగ్ లోకి తిరిగింది, చూస్తూండగానే.

లాల్ గబగబా కారు దిగేశాడు.

సుహాసిని! అనుకున్నాడతను ఆదుర్దాగా. సందేహం లేదు. ఇక్కడికెందుకొచ్చింది?

అతను తటపటాయిస్తూండగానే ఆమె బిల్డింగ్‌లోకి అదృశ్యమైంది. లాల్ తేరుకుని వేగంగా దాటేశాడు అటువైపు. లోపలికెళ్ళిపోయి మెట్లెక్కి చకచకా రెండో అంతస్థు చేరుకున్నాడు. మార్గంలో ఆమె ఎక్కడా కన్పించలేదుగానీ, లాల్ రెండో అంతస్థు నడవలోకి రాగానే ఆమె ఆ తలుపు దగ్గర బెల్ నొక్కుతోంది.

లాల్ వెనక్కి జరిగి, గోడచాటున మెట్లమీదే నిలబడ్డాడు.

అప్పుడు తలుపు తెరచుకుంది___

ఆమె చటుక్కున లోనకడుగు పెట్టింది___

ఆ వెంటనే తలుపు మూసుకుంది___

లాల్ విసురుగా కదిలాడక్కడికి. తలుపు దగ్గరాగి కీ హోల్‌లోంచి చూశాడు. ఏమీ కన్పించలేదు. కానీ మాటలు విన్పించాయి. అలాగే వంగి కీ హోల్‌లోకి చెవి ఆనించాడు.

లోపల ఆమె ఆశ్చర్యంగా చూస్తోందతన్ని.

అతను నవ్వుతూ చూస్తున్నాడు, తలుపు కానుకుని.

ఆమె చేతిలో కత్తి కంపిస్తోంది. నోరు తెరచి అస్పష్టంగా, "నువ్వు—నువ్వు—" అంది.

అతను నవ్వాపి, "నేనే సుహాసినీ....నీ అన్నని!"

"ఇక్కడికెలా వచ్చావ్?"

"నీ కోసమే వచ్చాను. ఇలా అయితేనే నిన్ను కలుసుకోగలననుకున్నాను. కలుసుకున్నాను. మొన్న మీ కరపత్రం చూసినప్పుడే నాకీ ఆలోచన కల్గింది...."

నవ్వాడతను మళ్ళీ, "నేనేం చేశానో తెలుసా? మీ సామైటీకి బోగస్ ఉత్తరం వ్రాసి పడేశాను, ఈ ఫ్రెండ్ మీద. ఆ ప్రకారం సువ్విక్కడికి వస్తావని వూహించాను. మూడు రాత్రులు యిక్కడే గడిపాను. ఇవేళ నా ఆశ ఫలించింది! అనుకున్నట్టే నువ్వొచ్చావు-"

బయట లాల్ ఉలిక్కిపడ్డాడు. ఇతనెప్పుడొచ్చాడు ఫ్లాట్‌లోకి? తను పోలీసులకు ఫోన్ చేయడానికెళ్ళి నప్పుడు-వచ్చేశాడా....

ఆమె గాభరాగా చూడసాగింది. "ఎందుకు—నన్నెం దుకు కలుసుకోవాలనుకున్నావు?"

సతీష్ ముఖం ఆవేశపూరితమైంది. "ఎందుకా? ఓహ్, సుహాసినీ! నువ్వేం చేస్తున్నావో తెలుసా? నీ వంటిమీద అసలు తెలివి వుందా? వాళ్ళెవరు? వాళ్ళు మనకేం చేశారు! వాళ్ళకోసం నువ్వేం చేస్తున్నావు! నాన్నని చంపినప్పట్నించీ, వాళ్ళ కారణంగానే అమ్మ పోయి నప్పట్నించీ, వాళ్ళే నీ నరేన్‌నికూడా చంపినప్పట్నించీ ఓహ్- నీకెలా చెప్పను, సుహాసినీ__పగతో నా గుండె రగిలిపోతోంది! వాళ్ళందర్నీ హతమార్చే సేగానీ నిద్ర పట్టదు నాకు! మరి నువ్వేమో—వాళ్ళతోనే చేతులు కలిసి ఉన్మాదిలా ప్రవర్తిస్తున్నావు!"

ఆమె కలవరంగా చూడసాగింది. ఆమె కళ్ళు విశా లంగా తెరచుకోసాగాయి, తెలుసుకుంటున్న వాస్త వాలకి.

అతను దగ్గరకొచ్చి ఆమెను పట్టుకున్నాడు. "వద్దు, సుహాసినీ! నువ్విలా చెయ్యొద్దు! నీకు జరిగిన అన్యాయాన్ని కాదనను. దానికి నువ్వు బదులు తీర్చుకున్నావు. అది చాలు. ఇంకెవరికోసమో నువ్వు నీ శక్తిని వృధా చేయడం

మంచిదిశాను. కళ్ళు తెరువు. నిజం తెలుసుకో! ఈ శక్తిని మన శత్రువులమీద ప్రయోగించు! నీకు నేనూ తోడ్పడతాను. ఇద్దరం కలిసి అంత మొందిద్దాం వాళ్ళని."

ఆమె తేరుకుని అతన్ని విడిపించుకుంది. ఆమె కళ్ళు ఒక్కసారిగా ఎర్రబారాయి. తీక్షణంగా చూసిందతన్ని. "వాళ్ళని ఏం చేయాలో నాకు తెలుసు, నువ్వు అడ్డు రాకు!"

"సుహాసినీ!"

"నా దారికి అడ్డు రాకు!"

"నువ్వొక్కదానివే ఏం చేస్తావు? నన్నూ రానియ్యి! వాళ్ళెక్కడుంటారో చెప్పు! ఇప్పుడే — ఈ రాత్రే వెళ్ళి అందర్నీ అంత మొందిద్దాం!"

ఆమె విసురుగా కదిలింది, "నన్నొదులుకోకు!"

అతను వెనుకనుంచి మళ్ళీ పట్టుకున్నాడు, "ప్లీజ్ నా మాట విను....నీకీ ఆవేశం పనికిరాదు!"

ఆమె కత్తి చూపించింది, "నన్ను వదుల్తావా, లేదా?"

"ఓహ్, సుహాసినీ!"

ఆమె విదిల్చి కొట్టిందతన్ని.

"సుహాసినీ!" అతను మళ్ళీ పట్టుకున్నాడామెని.

ఆమెకు సహనం నశించింది. ఉగ్రురాలైనది, కత్తిని ఝుళిపిస్తూ. అతను వెనక్కి తప్పుకోబోయాడు. కానీ అంతలోనే అది వచ్చి కుడి భుజానికి తగిలింది. బాధతో ఒక్క అరుపు అరిచాడు. అతని షర్టు ఎర్రబడిపోయింది. ఆమె కళ్ళలో క్రోధం మరింత దాల్చింది. కత్తిని లాగి బలంగా ఛాతీలో పొడిచింది. అతను ఛాతీ పట్టుకుని కిందపడ్డాడు. ఆమె ఆగలేదు, ఇంకా ఉన్మాదంతో

మరో పోటు పొడిచింది. అతను నేలమీద దొర్ల సాగాడు, ఛాతీ పట్టుకుని, రక్తం ధారలుగా కారిపోతూంటే....

"ఓ.హ్ — నేను — నేను — నీ అన్నను, సుహాసినీ! నువ్వు-నువ్వు తప్పు చేస్తున్నావు, సుహాసినీ! నువ్వు తొక్కుతున్న మార్గం...."

అతని కళ్ళు మూతబడుతున్నాయి. ఇంకా ఏదేదో గొణుగుతున్నాడు.

తలుపు మోగిపోతోంది. ఆ దెబ్బలకది వూడిపడేలా వుంది.

ఆమె తేరుకుంది. కత్తిని కింద పడేసింది. గాభరాగా అటూ ఇటూ చూసింది. లోపలి గదిలోకి వురికింది. వెనుక కిచెన్, బాత్ రూంలలోకి వెళ్ళి చూసింది. మార్గం లేదు. కిటికీలోంచి కిందికి చూసింది. తృళ్ళిపడి ఆ ఆలో మానుకుని తిరిగి ముందు గదిలోకొచ్చింది.

ఆమె నుదురంతా చెమటలు పట్టేసింది. వేగంగా వూపిరి తీసుకుంటూ మోగిపోతున్న తలుపుని చూడసాగింది. అవతలినుంచి అరుపుల్ని వినసాగింది. అప్పుడామె చెయ్యి హేండ్ బ్యాగులోకి వెళ్ళింది. అది రివాల్వర్‌తో బయటికొచ్చింది...

"సతీష్!....ఏయ్, సుహాసినీ! తలు

అరుపులు మరింత యెక్కువయ్యాయి.

గొంతులు బయట వినిపిస్తున్నాయి.

అప్పుడామె అడుగులు తలుపు దగ్గరికి పడ్డాయి.

అవి రక్తంతో తడిసి జాడల్ని సృష్టించాయి.

కింద సతీష్ నిర్జీవంగా పడివున్నాడు.

(సశేషం)